క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని బ్యాంకు కాలనీలో పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పార్టీ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం భాస్కర్ సెంటర్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు నివాళులు అర్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న హాజరుకావాలని కోరారు.

అమ్మవారికి రూ.6.86 లక్షలు ఆదాయం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా రూ.6.86 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. ప్రధాన హుండీల ద్వారా రూ.5,79,312లు, అన్నదాన హుండీల ద్వారా రూ.1,06,964లు ఆదాయం వచ్చినట్లు చెప్పారు. హుండీ లెక్కింపులో గ్రూప్–2 ఆలయాల ఈవో ఆర్.వెంకటేశ్వరరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, సభ్యులు కాకుమాను బదరీ నారాయణ, అభివృద్ధి కమిటీ సభ్యులు మునగా వెంకట వేణు మాధవరరావు, ములకలూరు చైతన్య గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



చిలకలూరిపేటటౌన్: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని డైక్‌మెన్ కాలనీకి చెందిన మార్పూరి భవాని శంకర్ (10) ఓ ప్రైవేటు స్కూల్‌లో నాల్గొ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో స్నేహితులతో కలసి ఇంటి పక్కన ఉన్న డాబాపై ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు భవాని శంకర్ చేతులు తగడంతో విద్యుదాఘాతమై కాలిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి సీతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చిరుమామిళ్ళలో ఫేర్‌వెల్

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి హాజరౌతారన్నారు. ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఫేర్‌వెల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బొల్లాపల్లి: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా పోలీసులు, పారామిలటరీ బలగాలు మండలంలోని పలుకూరు, కనుమలచెరువు, వెల్లటూరు గ్రామాల్లో సోమవారం కవాతు నిర్వహించారు. వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్, బండ్లమోటు ఎస్ఐ డి.చెన్నకేశవులు ఆధ్వర్యంలో కేంద్ర పారా మిలటరీ బలగాలు రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వివాదాలు, అల్లర్లకు తావు ఇవ్వకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నోటిఫికేషన్ వెలువడిన సమయం నుంచి ఫలితాలు వచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బండ్లమోటు పోలీసులు, సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలకు వెళ్లి.. పింఛన్ ఇచ్చి



వినుకొండ (నూజండ్ల): పింఛన్ దారులకు సకాలంలో పింఛన్ అందచేసేందుకు, దూరాలను సైతం లెక్క చేయకుండా చేరుకొని, లబ్ధిదారుల మోములో వలంటీర్లు సంతోషాన్ని నింపుతున్నారు. జగనన్న లక్ష్యాలకు అనుగుణంగా వలంటీర్ వ్యవస్థ తమ బాధ్యతలను నిర్వహిస్తూ, ప్రజల మన్ననలు పొందుతోంది. నూజండ్ల మండలంలోని పాతచెర్వుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన జడ్డా గోవిందయ్య పింఛన్ తీసుకునే సమాయానికి, అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడన్న సమాచారం తెలుసుకుంది. వలంటీర్ కోయా దివ్య జ్యోతి సదరు వైద్యశాలకు చేరుకొని పింఛన్ అందచేయడం పట్ల లబ్ధిదారురాలు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

జగనన్న పాలనలోనే మహిళలకు పెద్దపీట

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- జగనన్న ఇళ్ల స్థలాల పట్టా హక్కు పత్రాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేస్తూ అనేక పథకాలు ప్రవేశపెట్టారని, పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు రిజిస్ట్రేషన్ కూడా చేశారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులో బొల్లా కల్యాణ మండపంలో జగనన్న ఇంటి స్థలం హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినుకొండ టౌన్, రూరల్ మండలాల పరిధిలో 5850కి రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం తరపున సొంతింటి కల నెరవేర్చాలని ముఖ్యమంత్రి దేశంలో ఎక్కడా లేని విధంగా హక్కులు కల్పిస్తున్నారన్నారు. అలాగే గృహ నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో సగం ఇళ్లు కట్టి వదిలేశారని, ఆ ఇళ్లను కూడా తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు.

కాలనీపై విష ప్రచారం

ప్రతిపక్ష నాయకులు జగనన్న కాలనీపై కూడా విష ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వినుకొండలో 125 ఎకరాల్లో 5400 మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, అందులో 3 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. జగనన్న కాలనీలో పట్టణస్థాయి వసతులు కల్పించినట్లు చెప్పారు. 24 గంటలు విద్యుత్ సౌకర్యం కోసం నూతనంగా సబ్‌స్టేషన్ నిర్మించి అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ టీడీపీ నాయకులు అసత్యప్రచారాలు చేయడం పరిపాటిగా మారిందన్నారు.

గతంలో తాగునీరివ్వలేదు!

గతంలో వినుకొండ పట్టణానికి కనీసం తాగునీరు అందించలేని వారు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి బాపట్ల జిల్లాలో నిర్వహించిన సిద్ధం సభకు 15 లక్షలకు పైగా ప్రజలు హాజరైతే, సిద్ధం సభలకు జనం రావడం లేదని టీడీపీ చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. ముఖ్యమంత్రి సభలకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అసత్యప్రచారాలు చేస్తున్నారని వాస్తవాలు ప్రజలకు తెలుసని, రానున్న రోజుల్లో టీడీపీకి మరలా బుద్ధి చెబుతారన్నారు. వినుకొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, వార్డు కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహా రావు, ఎంఎస్‌కే బాషా, యారం రామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పీఎస్‌ఖాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, మాజీ ఎంపీపీ ములకా రామ తులసిరెడ్డి, కోపెల దేవరాజ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యూటీ తహసీల్దార్ అబ్బూరి వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీహరితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్ వైస్ ప్రిన్సిపల్‌గా కిశోర్‌బాబు



నియామకపత్రాన్ని అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ వైఎస్ కిశోర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ కిశోర్ బాబు పదోన్నతిపై వైస్ ప్రిన్సిపల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు నియామక పత్రాన్ని డాక్టర్ వైఎస్ కిశోర్ బాబుకు అందజేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎల్.సుమలత, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది కిశోర్ బాబుకు అభినందనలు తెలిపారు.

బీసీలు జగనన్నకు బాసటగా నిలవాలి

- మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



బీసీ కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పల్నాడు రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో బీసీలను ఆదరిస్తున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి మద్దతు పలికి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని 19వ వార్డు రామిరెడ్డిపేటలో రూ.15.75 లక్షల గడపగడప నిధులతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని 80 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన జగనన్న కాలనీ ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. వార్డులో బీసీలు అధికంగా ఉండటంతో గడపగడప నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయటం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో బీసీలకు జరిగిన న్యాయం చరిత్రలో ఎప్పుడూ జరగలేదని పేర్కొన్నారు. అందువల్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీసీ వర్గీయులు సహకరించాలని కోరారు.

విగ్రహాలు ఆవిష్కరణ

పల్నాడు రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంద్ర స్వామి, శ్రీ విశ్వకర్మ విగ్రహాలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆవిష్కరించారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, ముదిరాజు, స్వచ్ఛాంద్ర, గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వర రావు, కందుల ఎజ్రా, వడ్డెర సంక్షేమ కమిటీ సభ్యుడు వేముల శివ, విద్యార్థి విభాగ మూడు జిల్లాల కన్వీనర్ గోగుల మనోహర యాదవ్, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి జి.గాబ్రియేలు, మాజీ కౌన్సిలర్ బత్తుల లక్ష్మీ పద్మలత, రవివర్మ, కాంట్రాక్టర్ బత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రావిపాడులో...

నరసరావుపేట రూరల్: రావిపాడు గ్రామంలో రూ.55 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గత ఐదేళ్లలో అమలు చేసినట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామంలోని రెండు సచివాలయ పరిధిలో నూతనంగా నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలు, రెండు ఆర్‌బీకేలు, రెండు మిల్క్ చిల్లింగ్ యూనిట్స్, రెండు విలేజ్ హెల్త్ క్లినిక్స్‌ల ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో అధిక మొత్తంలో అభివృద్ధి, సంక్షేమాల ద్వారా రాష్ట్రప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన గ్రామం రావిపాడు అని చెప్పారు. కేవలం సంక్షేమ పథకాల ద్వారా రూ.37.56 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. గ్రామంలో 1100 మంది పెన్షన్‌దారులు ఉన్నారని వీరికి ప్రతినెలా పెన్షన్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. రూ.17.60 కోట్లతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.3 లక్షలతో పనులు పూర్తిచేసినట్టు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మున్సిపాలిటీకీ అందించే తాగునీటిని రావిపాడు గ్రామానికి అందించేందుకు ట్యాంక్‌ల ఏర్పాటు ద్వారా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మీ కుటుంబాలకు మేలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌ను కొనసాగించేలా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, పీఆర్ డీఈ హరనాథ్, ఏవో సురేంద్ర బాబు, మాదినేని వాసు, నూతలపాటి జోజి, అట్లూరి సుబ్రహ్మణ్యం, కొలికొండ కోటేశ్వరరావు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ఎంపీపీ సుహాసిని అనిల్‌కుమార్

శావల్యాపురం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమన్వంతో విధులు నిర్వహించి అర్హత కల్గిన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నాడు–నేడు మనబడి పథకంలో భాగంగా లక్షల కోట్లు వెచ్చిస్తున్నారని, కార్పొరేటు తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో ఆధునీకరణ పరిజ్ఞానం ద్వారా విద్యార్థులకు అందిస్తున్నారన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పూర్తిస్థాయిలో తక్కువగా ఉందని, దీనిపై మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని వేల్పూరు ఎంపీపీ స్కూల్లో ఒక ఉపాధ్యాయుడు, ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం లేకపోవడం వల్ల ఎంపీపీ స్కూల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. మండలంలోని ముండ్రువారి పాలెం గ్రామసర్పంచ్ పాపసాని వెంకాయమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో తరగతి గదులు శ్లాబు పెచ్చులూడి పోవటంతో పాటు ఎలుకలు తిరుగుతున్నాయని తద్వారా చిన్నారులకు గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సైతం ఎలుకలు తింటున్నాయన్నారు. గ్రామానికి చెందిన కొందరు ఎంపీపీ స్కూల్లో గేదెలను కట్టి వేసుకోవటం వలన విద్యార్థులు పలు రకాలుగా అగచాట్లు పడుతున్నారన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం కూడా ఇదే స్కూలు కావటం చేత పలుమార్లు అధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపినా ఫలితం లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు సమావేశంలో చెప్పిన అంశాలను అధికారులు లిఖిత పూర్వకంగా నమోదు చేసుకుని సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు చెన్నంశెట్టి రంగారావు, నంబూరి ప్రభావతి, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య, ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కాశీరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

- మృతుల కుటుంబాలకు నేతల అభయం
- నరసరావుపేట, వినుకొండలలో నివాళులు అర్పించిన ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్, ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎమ్మెల్యే బొల్లా

నరసరావుపేట: సిద్ధం సభకు వస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన గేదెల దుర్గారావు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సత్తెనపల్లి రోడ్డులోని సీబీ కాలనీలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ యాదవ్‌తో కలిసి దుర్గారావు మృతదేహాన్ని సందర్శించి ఇరువురూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ దుర్గారావు మృతి బాధాకరమైందన్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. తొలుత తాము రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని, అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తెలుసుకొని ఐదు లక్షలు కాదు రూ.10 లక్షలు ఇవ్వాలని ఆదేశించారన్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో చెక్కు అందజేస్తామని తెలిపారు. కొంత ఆర్థిక సహాయాన్ని మృతుడి బంధువుకు అప్పగించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి కొండ, షేక్ కరిముల్లా, షేక్ మహబూబు బాష, హాలీవుడ్ రఘు, వలంటీరు మల్లిక పాల్గొన్నారు.

కాశీరెడ్డి మృతి బాధాకరం: ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి సిద్ధం సభకు వెళ్లి తిరిగి వస్తూ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందిన నూజెండ్ల మండలం రవ్వవరం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి కాశీరెడ్డి (43) మృతదేహానికి ఎమ్మెల్యే బొల్లా ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం మేదరమెట్లలో జరిగిన సిద్ధం సభకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొల్లా హుటాహుటిన గ్రామానికి వెళ్లి కాశీరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బొల్లా మాట్లాడుతూ సభకు వెళ్లి మృతిచెందడం బాధాకరమని కాశీరెడ్డి కుటుంబ సభ్యులను పార్టీ పరంగా, ప్రభుత్వపరంగా ఆదు కుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ జయరామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

13న బహిరంగ వేలం

శావల్యాపురం: స్థానిక పోలీసు స్టేషను పరిధిలో మద్యం కేసులో పట్టుబడిన రెండు వాహనాలను ఈ నెల13న బహిరంగ వేలంపాట నిర్వహించుతున్నట్లు ఎస్సై చల్లా సురేష్ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆ టో, హోండా అమేజ్ కారులను బహిరంగ వేలంపాట నిర్వహిస్తామన్నారు. వేలంపాటలో పాల్గొనే వారందరూ రూ. 2 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు.

చిరుధాన్యాలతో ఎన్నో ప్రయోజనాలు



నాదెండ్ల: రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవటం వలన బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏసీడీపీవో నిర్మల చెప్పారు. సాతులూరు సెక్టార్ పరిధిలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం –3లో సోమవారం సంపూర్ణ పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ పక్షోత్సవాలు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంప్రదాయ చిరుధాన్యాల ఆధారిత ఆహారాన్ని నిత్యం వినియోగించాలన్నారు. స్థానికంగా లభించే మినుములతో పౌష్టికాహార రకాల తయారీ విధానం చూపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణలో చిరుధాన్యాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అనంతరం తల్లులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, హెచ్‌ఎం మహమ్మద్ రహంతుల్లా, కార్యదర్శులు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మీ, మల్లేశ్వరి, అఖిల పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఉపయోగం



పంట కోత ప్రయోగంలో భాగంగా శనగ కాటా వేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించటం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ సహచరుడు సైదయ్య చెప్పారు. మండలంలోని మానుకొండవారి పాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన శనగ పంట వ్యవసాయ క్షేత్రంలో పంటకోత ప్రయోగం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గిపోయి నికర ఆదాయం పెరుగుతుందని వెల్లడించారు. దీనికి తోడు విషతుల్య రహిత ఆహారం లభిస్తుందని చెప్పారు. దీనికి తోడు శనగ పంటలో అంతర్ పంటలుగా ఆవాలు, కొత్తిమీర, జొన్న, పొద్దుతిరుగుడు వంటి పంటలు వేయడం వలన అంతర పంటల ద్వారా శనగ పంట ఖర్చు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఐదు చదరపు మీటర్ల పరిధిలో శనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. దీనికి గాను 4.200 కేజీల దిగుబడి రావడంతో ఎకరాకు 6.80 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఐలయ్య, రైతు కల్లి శేషిరెడ్డి పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

బొల్లాపల్లి: సిద్ధం సభకు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను గుర్తుతెలియని దుండగులు చించివేశారని మండలంలోని కనుమలచెరువుకి చెందిన నాయకులు తెలిపారు. పీర్లచావిడి కూడలి వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సిద్ధం ఫ్లెక్సీని గుర్తు తెలియని దుండగులు చించివేశారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు షేక్ చిన సాయిబయ్య, ఎం.వీర బాబునాయక్, వి.వెంకటేశ్వర్లు తెలిపారు.



విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

- డీఈ శ్రీనివాసరావు
- 127 మందికి రూ.6 లక్షల 32 వేల అపరాధ రుసుం విధింపు



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

శావల్యాపురం: విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 127 మందికి రూ.6 లక్షల 32 వేల అపరాధ రుసుం విధించినట్లు నరసరావుపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆపరేషన్ డీఈ శంకరశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేయటం చట్టరీత్యా నేరమన్నారు. మండలంలోని శావల్యాపురం విద్యుత్ సబ్ స్టేషను పరిధిలోని ఇర్లపాడు, వేల్పూరు, శానంపూడి, గంటావారిపాలెం, కొత్తలూరు, కృష్ణాపురం గ్రామాల్లో 40 మంది విద్యుత్ అధికారులు 120 మంది విద్యుత్ సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి 3231 సర్వీసులు తనిఖీ చేశారని వివరించారు. ఇటీవల జరిగిన కోటప్పకొండ తిరునాళ్ల వేడుకల్లో గతంలో ఎన్నడు లేని విధంగా ప్రభలు తరలించే సమయంలో వినుకొండ నియోజకవర్గంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ఆధునీకరణ యంత్ర పరికరాలు ద్వారా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. తిరునాళ్ల వేడుకల్లో 250 మంది విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి తిరునాళ్ల వేడుకల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు డీపీఈ కె.సూర్యప్రకాష్, ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి, ఏఈ సంపెంగుల గాంధీ, ఎల్లయ్యలు దావులూరి ఏడుకొండలు, శివకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి అంకాల గంగయ్య తన మిత్రుడు రమణాల వెంకటేశ్వరరావుతో కలిసి ఈనెల 8వ తేదీన కోటప్పకొండ తిరునాళ్లకు వెళ్లాడు. మరుసటి రోజు తెల్లవారుజామున గ్రామానికి వచ్చేందుకు ఇద్దరు ఓ ఆటో ఎక్కారు. ఆటో డ్రైవర్ నిద్రమత్తులో యడ్లపాడు–వంకాయలపాడు మార్గ మధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి వెనుక ట్రక్కును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్, అతని తల్లి, గంగయ్య, అతని మిత్రులకు గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది వీరిలో తీవ్రగాయాలైన గంగయ్యను గుంటూరు సమగ్ర ఆస్పత్రికి, మిగిలిన వారిని కాటూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం గంగయ్య (22) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గంగయ్య తండ్రి సింగయ్య ఆటో డ్రైవర్ నిద్రమత్తులో నిర్లక్ష్యంగా నడిపినట్లు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్ తెలిపారు.